క్లుప్తంగా

ఉత్తమ విద్యార్థులకు ఆర్థికసాయం

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు శనివారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు జూలకంటి అశోక్ రెడ్డి రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ఎర్రబెల్లి పాఠశాల అభివృద్ధికి రూ. 25వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అశోక్ రెడ్డిని అభినందించారు.

హెచ్ఎం శంకరయ్యకు సన్మానం



శంకరయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెట్ ప్రధానోపాధ్యాయుడు సల్వాది శంకరయ్య ఉద్యోగ విరమణ పొందాడు. శనివారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాఠశాలలో శంకరయ్యకు సాన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి శంకర్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ జూలకంటి అశోక్ రెడ్డి, నిడమనూరు పీఏసీఎస వైస్ చైర్మన్ సిరిగిరి శ్రీనివాస్ రెడ్డి, మధుబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలని వినతి

త్రిపురారం : నాగార్జున సాగర్ లెఫ్ట్ కెనాల్ బ్రాంచి కెనాల్స్‌పై పని చేస్తున్న లష్కర్ల(ఎన్ఎంఆర్)లను పర్మినెంట్ చేసేవిధంగా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య శనివారం నాగార్జున సాగర్‌లో ఎంపీ నివాసంలో ఎంపీ రఘువీర్ రెడ్డికి లష్కర్లతో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎన్ఎస్పీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పెరికె వెంకటేశ్వర్లు, కార్యదర్శి నారాయ పైదారావు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన సింగం గురవయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఆయనకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మంజూరైన రూ.27వేల సీఎం సహాయ నిధి చెక్కును శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎరుకలి వెంకన్న, నరేష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు

దేవరకొండ: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని దేవరకొండ డీటీసీఎస్ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గత రెండు రోజుల క్రితం దేవరకొండ నుంచి 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా దేవరకొండ పోలీసుల సహకారంతో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.పట్టుబడిన రేషన్ బియ్యం రేషన్ దుకాణం నం:12 నుండి తరలించారని తేలడంతో శనివారం సదరు దుకాణంలో తనిఖీ నిర్వహించగా 20 క్వింటాళ్ల బియ్యం తక్కువ ఉండడంతో 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రామ దుర్గారెడ్డి



హాలియా : హాలియా మున్సిపల్ నూతన కమిషనర్‌గా రామ దుర్గారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. హాలియా మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన ఎండీ అన్వర్ అలీ బదిలీపై చండూర్ మున్సిపాలిటీకి వెళ్లారు.

డైమండ్ నేత్ర నిధికి నేత్రదానం


మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన గోవిందు జానకమ్మ మరణించడంతో వాసవీ క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్ సహకారంతో వాసవీక్లబ్ రీజినల్ 7 చైర్మన్ మిట్టపల్లి విజయభాస్కర్ రావు సహకారంతో జానకమ్మ నేత్రాలను డైమండ్ నేత్ర నిధికి వారి కుటుంబ సభ్యులతో శనివారం సేకరించారు. అనంతరం డైమండ్ నేత్ర నిధి అధ్యక్షులు మాశెట్టి శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో జానకమ్మ కుటుంబ సభ్యులతో పాటు క్లబ్ 7ఆర్ ఉమెన్ మండలాధ్య శ్రీనివాస్, టెక్నీషియన్ రమేష్ తదితరులున్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

చింతపల్లి: గ్రామాలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు లక్షల రుణమాఫీ అందుతుందని,దేవరకొండ ఏ డీఏ శ్రీలక్ష్మి అన్నారు.శనివారం మండల పరిధిలోని గడియ గౌరారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నూతనంగా ప్రకటించిన రుణమాఫీలో అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

- నేటి నుంచి 'పోషణ్ అభియాన్' కార్యక్రమం
- మాతాశిశు మరణాలు తగ్గించేందుకు మాసోత్సవాలకు శ్రీకారం



ఐసీడీఎస్ ప్రాజెక్టులు	09
అంగన్‌వాడీ కేంద్రాలు	2093
7నెలల నుంచి 5 ఏళ్లలోపు పిల్లలు	79,698
గర్భిణులు	9607
బాలింతలు	7064

మిర్యాలగూడ టౌన్ : మాతాశిశు మరణాలను నివారించడంతో పాటు ఆరోగ్య తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'పోషణ అభియాన్' మాసోత్సవాలకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణులకు పౌష్టిక్రమంపై అవగాహన కల్పించడం, అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ మాసోత్సవాలు ఈనెల 30వ తేదీతో ముగుస్తుంది. జిల్లా వ్యాప్తంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిని సక్కుబాయి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

తొమ్మిది ప్రాజెక్టుల పరిధిలో...

నల్లగొండ జిల్లాలోని అనుముల, చింతపల్లి, దామరచర్ల, దేవరకొండ, కొండమల్లేపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, మునుగోడు, నకిరేకల్ ప్రాజెక్టులుండగా వీటి పరిధిలో 2093 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతంతో పాటు పలు రకాల పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. పిల్లల ఎత్తు, బరువు, చూసేలా అవసరమైన వైద్య పరీక్షలను చేయిస్తూ వారికి ఇబ్బందులు లేకుండా చూడనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో...

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారిలో 5 ఏళ్లలోపు పిల్లలకు ప్రాథమిక విద్యతో పాటు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ మధ్యాహ్న భోజన పథకము ప్రవేశపెట్టింది.ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. ఈ పథకం ద్వారా నెల 30 గుడ్లు అందిస్తున్నారు.

పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పిస్తున్నాం. గర్భిణీ, బాలింతలు పోషకాహారం తీసుకుంటే మాతా శిశు మరణాలను తగ్గించవచ్చు. పోషహాహార విలువలు కలిగిన ఆహారాన్ని క్రమ పద్ధతిలో తీసుకుంటే మంచిది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన్న, జన్మదిన వేడుకలను కూడా నిర్వహించనున్నాం. పోషణ స్థాయిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం.

– సక్కుబాయి స్త్రీ,శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్, నల్లగొండ

రక్తహీనత నుంచి బయట పడాలంటే..

ఐరన్ ఎక్కువగా లభించే ఆకు కూరలు, ఖర్జూరా, బీట్ రూట్ వంటివి తీసుకోవాలి. బెల్లం, వేరుశనగలు, రాగి జావా వంటివి తీసుకోవాలి. పోషణలోతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని వైద్యులు అందించే ఐరన్ మాత్రలను వేసుకోవాలి. చిన్న వయస్సుల్లోనే పెళ్లిళ్లు చేసుకోవడం వలన గర్భిణులకు రక్త హీనత కారణం అవుతుంది. రక్తహీనత కు గురి అయితే కాన్పు సమయంలో ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంటుంది. అదే విధంగా పాఠశాల దశలోనే ఆట పాటలతో పాటు పిల్లలు ఎక్కువగా చదువుల్లో నిమగ్నం అవుతారు. 10 నుంచి 10 ఏళ్ల పాటు వారి ఎదుగుదల గణనీయంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. అదే సమయంలో హార్మోనులు, లైంగిక మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ దశ నుంచే మంచి ఆహారాన్ని అందిస్తే చిన్నారుల ఎదుగుదల బాగుంటుంది. ఈ దశలో భాగంగా 9.10 సెంటీమీటర్ల ఎత్తు పెరగడంతో పాటు 8 నుంచి 10 కిలో వరకు బరువు కూడా పెరుగుతారు. ఆ దశలో శరీరం ఎదుగుదలకు ఎక్కువగా దోహదపడతాయి.

ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి, చిట్యాల గ్రామాల్లో శ్రీఆంజనేయస్వామి తిరునాళ్లల్లో భాగంగా శనివారం నల్లగొండ పార్లమెంటు సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు యడవల్లి కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాదిరి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు రమావత్ బాలునాయక్, నాయకులు గోపగాని హనుమంతు, తమ్మడబోయిన అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలి

వేములపల్లి(మాడ్గులపల్లి) : ప్రతి ఒక్కరూ దైవ చింతను కలిగి ఉండాలని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. శనివారం మాడ్గులపల్లి మండలంలోని గజలాపురం గ్రామంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, పీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, నాయకులు పాదిరి శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, స్కైలాబ్‌నాయక్, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పుల్లెంల నరసింహ, సైదులు, భిక్షులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అమలు



పులిమామిడిలో రైతు కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగుతున్న వ్యవసాయ అధికారి

హాలియా : అర్హులైన ప్రతి రైతుకు రూ. 2లక్షల రుణమాఫీ అవుతుందని అనుముల మండల నోడల్ అధికారి, ఏఓ సరిత అన్నారు. శనివారం మండలంలోని పులిమామిడి గ్రామంలో రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. అనుముల మండలంలో వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. బ్యాంకులో అకౌంట్ నంబర్‌కు ఆధార్ లింక్ కాకున్నా, ఒకే ఆధార్ నంబర్ రెండు అకౌంట్‌లకు ఉన్నా, అకౌంట్‌లో పేరు తప్పు ఉన్నా రుణమాఫీ వర్తించదంటేదని వాటిని బ్యాంకులో సరిచేసుకోవాలన్నారు. రేషన్‌కార్డు లేని వారికి కుటుంబ సభ్యుల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



మూసీ పరీవాహక ప్రాంతం వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

మిర్యాలగూడ : రానున్న మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచన మేరకు మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మిర్యాలగూడ మండల పరిధిలోని వర్షాభావ ప్రాంతాలను, దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణా, మూసీ సంగమం వద్ద నీటి ఉధృతిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. శని, ఆది, సోమ వారాల్లో అధిక వర్ష సూచనలు ఉన్నందున డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వరద ముంపుకు గురయ్యే ప్రాంతవాసులను ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర సహాయ చర్యల కోసం ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ ఏర్పాటు చేశామని, ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వరద ఉధృతి, ముంపు తీవ్రత, కాల్వ కట్టలు దెబ్బతిన్నట్లయితే 8689295001 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కరుణాకర్ ఒక ప్రకటనలో కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే తక్షణమే వారికి వసతిని కల్పించాలన్నారు.

దేవరకొండ: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు ప్రకటనలో తెలిపారు.ఆర్డీఓ కార్యాలయంలో ఈ మేరకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు కలిగినా కంట్రోల్ రూం ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన అన్నారు.కంట్రోల్ రూం నెం:08691–298155, 9848407387ను సంప్రదించాలని కోరారు.

సాగు చేసిన ప్రతి ఎకరాకు నీరందిస్తాం

డిండి: వానాకాలం సీజన్‌లో డిండి ఆయకట్టు కింద సాగు చేసిన ప్రతి ఎకరానికి పంట చివరి దశ వరకు నీరందిస్తామని రైతులెవరూ ఆందోళన చెందొద్దని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శనివారం ఒక ప్రకటనలో భరోసానిచ్చారు. ఈ సందర్భంగా డిండి ప్రాజెక్టు నుంచి ఆయకట్టు సాగుకు నీటిని విడుదల చేయడంతో రోజురోజుకు ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుతుండడంతో ప్రస్తుతం పది రోజుల వరకు విడుదలయ్యే నీరు మాత్రమే నిల్వ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపి సాగు చేసిన పొలాల్లో ఒక ఎకరం కూడా ఎండిపోకుండా నీరందేలా చూడాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీను తదితరులున్నారు.

సాగునీటిని విడుదల చేయాలని వినతి

వేములపల్లి (మాడ్గులపల్లి): డి–40 కాల్వ ద్వారా సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలని మాడ్గులపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు శనివారం నల్లగొండలో సీఈ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం, మాధవగూడెం, గుర్రప్పగూడెం, తోపుచర్ల గ్రామాల్లోని రైతులు వర్షాధారంపై ఆధారపడి పంటలను సాగు చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జానయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యాదయ్య, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న బాలాజీనాయక్

నాగార్జునసాగర్: నందికొండను కాషాయంగా మార్చాలని గిరిజన మోర్చా నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కష్తావత్ బాలాజీనాయక్ అన్నారు. శనివారం నందికొండలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. నందికొండ మొదటి స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో సర్పంచ్,వార్డుమెంబర్లు, ఎంపీటీసీ,జడ్పీటీసీ స్థానాలను అధిక సంఖ్యలో బీజేపీ కైవసం చేసుకునేలా కష్టపడాలని పిలుపునిచ్చారు. ప్రతి బూతుకు మినిమమ్ 200 మంది సభ్యత్వాలను నమోదయ్యేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కంచెర్ల వెంకటేశ్వర్లు,బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముభూపాలచారి,టౌన్ ప్రధాన కార్యదర్శి ఎర్రబోయిన రాజు,జయమ్మ,రమణమ్మ,ప్రేమారెడ్డి, మహేష్,నాగరాజు,విక్రంనాయక్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగు పరచాలి



ఎస్సీకాలనీలో పర్యటిస్తున్న ఎంపీడీఓ కరుణాకర్

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని పలు కాలనీలతో పాటు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ కరుణాకర్ రావు సందర్శించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చే రోగులకు కావాల్సిన మందుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వార్డులో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగు పరచాలన్నారు. అదే విధంగా మురుగు కాలువలో చెత్త చెదారం వేయకుండా డస్ట్‌బిన్ ప్రాంతంలో పడేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఎలాంటి అంటు వ్యాధులు కూడా దగ్గరికి రావాన్నారు. ఆయన వెంట ఎంపీఓ మోహన్ బిన్ అహ్మద్, ఉమామహేశ్వర్, బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంతమైన వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలని మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ నరేష్ అన్నారు. శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అన్ని గ్రామ పంచాయతీల పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక ఉత్సవాలను నిర్వహించే ఉత్సవ కమిటీ తప్పని సరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ ఉమాపతిరావు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆలయ తృతీయ వార్షికోత్సవం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శ్రీ దుర్గా మాత ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో దుర్గామాతకు అష్టోత్తర సహస్రనామాలు, వాస్తు పూజ, హోమం, ఆంజనేయస్వామికి ఆకు పూజ తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత పస్నూరి యుగంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, కొట్టపల్లి కృష్ణ, ఆలయ పూజారి గణపతి శర్మ పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవం నిర్వహించాలి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం నుంచి పోషణ మాసోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని సీడీపీఓ రేఖ మమత అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు పోషణ మాసం కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు ఉన్నారు.

స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రతి మండల కేంద్రంలో ఎరుకల సంక్షేమంతో పాటు విద్యార్థులు చదువుకునేందుకు స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నేత వజ్జగిరి అంజయ్య అన్నారు. శనివారం పట్టణంలో జెండా వందన సందర్భంగా సంఘం కుర్ర జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు సంఘం బలోపేతంకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వజ్జగిరి వెంకన్న, మహేష్, వెంకటేశ్వర్లు, శ్రీను, నాగయ్య, మారయ్య ఉన్నారు.

సస్పెండ్ చేయాలి

దేవరకొండ: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని అవమానపర్చిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్–టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు.భువనగిరిలో మంత్రుల పర్యటన సేవర్యం లో హెలిప్యాడ్ వద్దకు వెళ్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని పోలీసులు మీరు ఎవరో తెలియదంటూ మాట్లాడి అవమానపర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తిని పోలీసు అధికారులు గుర్తించకపోవడం బాధాకరం మన్నారు .దళిత,గిరిజన ఎమ్మెల్యేలను అవమానపర్చితే సహించేదిలేదన్నారు.

ప్రోత్సాహకాలు అభినందనీయం

గుర్రంపోడు : పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలకు దాతల సేవలు అభినందనీయమని మండల నోడల్ అధికారి, పాఠశాల హెచ్ఎం నోముల యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని కొప్పోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ పెద్ద వేనేపల్లి నర్సింహారావు తన తండ్రి కీర్తిశేషులు పట్టాభిరామారావు జ్ఞాపకార్థం విద్యార్థులకు నగదు బహుమతి పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. 2023–24 సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన వారికి 15000,12500,10000రూపాయల దాత నర్సింహారావు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తలకుంట్ల రవికుమార్, నాగరాజు, కట్టికోల రామకృష్ణ, సురేష్, మారెపల్లి రామకృష్ణ, రాజశేఖర్, వేణు, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం 11.15లక్షలు

త్రిపురారం : నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామ పంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ కోట మైసమ్మ తల్లి హుండీ ఆదాయం రూ. 11 లక్షల 15 వేలు వచ్చినట్లు శ్రీ కోట మైసమ్మ తల్లి ఆలయ కార్యనిర్వహణ అధికారి నవీన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెల నుంచి 31 ఆగస్టు 2024 వరకు హుండీలో భక్తులు వేసిన కానుకల ఆదాయాన్ని ఆలయ చైర్మన్ అంజనేయులు ఆధ్వర్యంలో పరిశీలకు రమేష్ సమక్షంలో భక్తుల ముందు లెక్కించినట్లు పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ సేవలు అభినందనీయం

హాలియా : గత 32 సంవత్సరాలుగా పోలీస్ వృత్తిలో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ జానయ్య సేవలు అభినందనీయమని ఎస్ఐ సతీష్‌రెడ్డి అన్నారు. హాలియా పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేసిన జనవయ్య పదవీ విరమణ సందర్భంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్ఐ సతీష్‌రెడ్డితో పాటు పోలీసులు హెడ్ కానిస్టేబుల్ జనవయ్య దంపతులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గొనెన్, శ్రీనివాసులు, గోవిందరాజు, క్రవణ్, శేఖర్, కోటయ్య ఉన్నారు.

వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం



మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో నిలిచిన వర్షపు నీరు



హాలియాలో కురుస్తున్న వర్షం



పెద్దపూరలో వంతెనపై నుంచి వెళ్తున్న చిన్నవాగు

- మిర్యాలగూడలోని విద్యుత్, మున్సిపల్ కార్యాలయాల్లోకి వర్షపు నీరు
- ఎడతెరిపి లేని వర్షంతో రైతుల్లో హర్షం

మిర్యాలగూడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నియోజకవర్గ వ్యాప్తంగా రెండు రోజులుగా వర్షం కురుస్తుంది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు వేసిన పంటలు జీవం పోసుకున్నాయి. వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పట్టణంలోని విద్యుత్, మున్సిపల్ కార్యాలయాల్లోకి వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. చిన్న వర్షం వస్తే చాలు ఈ కార్యాలయాల్లో వర్షపు నీరు భారీగా నిల్వ ఉండి చెరువుల్లా దర్శనమిస్తుంటాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వర్షపు నీరు చేరడంతో కార్యాలయాలకు వచ్చే విద్యుత్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఆయా పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల కష్టాలు తీర్చాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే జలా దర్శనమిస్తుండడంతో తో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దేవరకొండ: దేవరకొండలో శనివారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది.ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురవడంతో పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు పలు చోట్ల అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి.భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు.దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.అంతేకాకుండా మున్సిపల్,రెవెన్యూ అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేకంగా మూడు టీంలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.పారిశుద్ధ్య సిబ్బంది సైతం షిఫ్ట్‌ల వారిగా విధుల్లో ఉంటున్నట్లు పేర్కొన్నారు.గతంలో శిథిలావస్థకు చేరిన ఇండ్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు.వర్షాల నేపథ్యంలో కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లలో నివాసం ఉండకూడదని,అధికారులకు సూచనలు పాటించాలన్నారు.

హాలియా : అనుముల మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా ముసురుతో కూడిన వర్షంతో మండల రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తుంది. రోజంతా వర్షం కురవడంతో మండలంలోని గ్రామాల్లో వీధులన్నీ జలమయమయ్యాయి. ఈ వర్షం కారణంగా వానకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి, పత్తి పంటలతో పాటు బత్తాయి తోటలకు ఊపిరిపోసినట్టయింది.

నిండు ముసిరిన వానలు

త్రిపురారం : రెండు రోజుల నుంచి నిడమనూరు మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పలు గ్రామాల్లో లోతట్టు వంతెనల వద్ద రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆ పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండల వ్యాప్తంగా రెండు రోజులుగా ముసురు కురుస్తుంది. దీంతో రైతులు తాము వేసిన పంటలు జీవం పోసుకున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలతోపాటు చిరు మర్రి, ఆగామోత్కూర్, బొమ్మకల్, కల్వలపాలెం బొండలపల్లి బ్రిడ్జిలు నిండి అలుగుపోస్తున్నాయి.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల వ్యాప్తంగా శనివారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వర్షపు నీరు చేరగా, అంతర్గత రహదారులు వర్షపు నీటితో జలదిగ్బంధం అయ్యాయి. వర్షంతో నిత్యం రద్దీగా ఉండే కొండమల్లేపల్లి బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా నిర్మానుష్యంగా మారింది.

పెద్దవూర: ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభమైన రెండు నెలలు అయినా ఇప్పటివరకు మండలంలో భారీ వర్షం కురవలేదు. వ్యవసాయ పొలాలలో సరైన వదును కూడా కాలేదు. శుక్రవారం రాత్రి ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా పొద్దంతా కురిసింది. కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో మండల కేంద్రంలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై ఇరుకు వంతెన సమీపంలో రోడ్డుపై పెద్ద గుంత పడింది. రెండు అడుగుల మేర వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

త్రిపురారం : నిడమనూరు, త్రిపురారం మండల వ్యాప్తంగా గ్రామాల్లో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. త్రిపురారం మండల కేంద్రం నుంచి కుక్కడం వెళ్లే రహదారిలో బాబుసాయి పేట వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మించిన తాత్కాలిక వంతెన వరద ఉధృతికి శనివారం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో త్రిపురారం ఎస్ఐ వై ప్రసాద్ ప్రమాదకర వరద నీటిని పరిశీలించి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఎంపీ రఘువీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి, డీసీసీ కేతావత్ శంకర్ నాయక్‌తో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.